

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అరవింద్‌రెడ్డి, కాలనీవాసులు

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 8(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో హరిహరపురం కాలనీవాసులు కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగర్ కాంప్లెక్స్ నుంచి వచ్చే వరదనీటి పైప్‌లైన్ పనులు పూర్తిచేసి వరదనీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. అదేవిధంగా దోమల నివారణ, కాలువల్లో పేరుకపోయిన మట్టిని తొలగించి, వరదనీరు సాఫీగా వెళ్లే విధంగా తగు చర్యలు తీసుకుంటానన్నారు. అతి త్వరలోనే కాలనీని సందర్శించి ఇతర సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



బి- బ్లాక్ పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : అరుణారెడ్డి

సైదాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నానని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి బీ బ్లాక్ కాలనీ పార్కులో అభివృద్ధి పనులు పరిశీలించారు. పార్కులు ఆహ్లాదకరంగా ఉంచేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునందారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రఘునాథరెడ్డి, సర్కిల్ మేనేజర్లు కిరణ్, యమున పాల్గొన్నారు.



కలుషిత నీటి పరిష్కార చర్యలను పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌రెడ్డి

కలుషిత నీటి సమస్య పరిష్కారం

మన్సూరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్, ముస్లిం బస్తీల్లో నెల రోజులుగా కలుషితమై వస్తున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కలుషితనీటి సమస్యతో ఆయా ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసిన స్థానిక మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల విఠల్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. బుధవారం సమస్యను పరిశీలించి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు జలమండలి అధికారులతో మాట్లాడారు. దీంతో గురువారం కొప్పుల విఠల్‌రెడ్డితో కలిసి జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి కలుషితమవుతున్న ప్రాంతాన్ని పరిశీలించి సిబ్బందితో పనులు చేయించి కలుషితనీటి సమస్యను పరిష్కరింపజేశారు. నెల రోజులుగా వస్తున్న కలుషితనీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడం పట్ల కొప్పుల విఠల్‌రెడ్డికి ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ ప్రేమ్‌కుమార్, బస్తీ, విలేజ్ వాసులు పాల్గొన్నారు.



సైదాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చంద్రమోహన్‌ను గురువారం ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డిలు కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు అమర్నాథ్‌రెడ్డి, రేణుక ముదిరాజ్ పాల్గొన్నారు. - సైదాబాద్, ఆంధ్రజ్యోతి



ట్రంకులైను పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ట్రంకులైను పనుల పరిశీలన

హయత్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్‌లోని స్వాతిరెసిడెన్సీలో జరుగుతున్న భూగర్భ ట్రంకులైను పనులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కాలనీవాసులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రంకులైను పనులకు వచ్చిన అవంతరాలను దాటుకుని పనులు చేయించడం జరుగుతుందన్నారు. ప్రజల సహకారంతోనే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



బాటసింగారంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

అబ్దుల్లాపూర్‌మెట్, మే 8(ఆంధ్రజ్యోతి): మండలం బాటసింగారంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నట్లు నిర్వాహకులు బాలకృష్ణచారి, ఉమాకాంత్‌చారి, ఉపేంద్రచారి, శ్రీనివాస్‌చారి తెలిపారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వారు పేర్కొన్నారు. సాయంత్రం 6గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 8గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని కోరారు.

ఏ దారెటు వెళ్తుందో!

నాదర్‌గుల్ సమీపంలో మూడు కూడళ్ల జంక్షన్‌లో వాహనదారులు తికమక

సూచిక బోర్డులు ఏర్పాటు చేయని ఆర్ అండ్ బీ అధికారులు

సరూర్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): అది మూడు రోడ్ల కూడలి(ట్రై జంక్షన్).. సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఎటు వైపు వెళ్లాలో తెలియక వాహనదారులు తికమకపడుతున్నారు. నాదర్‌గుల్, తుర్కయంజాల్, గుర్రంగూడ నుంచి నాదర్‌గుల్ సమీపంలోగల మూడు కూడళ్ల జంక్షన్‌కు చేరుకున్న వాహనదారులు తాము వెళ్లాల్సిన దారి ఎటో తెలియకపోవడంతో అటుగా వెళ్లే వారిని అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు వైపులా ఒక్క సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.



వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి

జంక్షన్‌లో వేగ నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో వేగంగా వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నాదర్‌గుల్-గుర్రంగూడ-తుర్కయంజాల్ ట్రై జంక్షన్ వద్ద ఎటు వెళ్లాలో తెలియక తికమక పడుతున్న వాహనదారులు

ఆర్‌సీఐ నుంచి సాగర్ రోడ్డు దాకా..

బాలాపూర్‌లోని మల్లాపూర్ ఆర్‌సీఐ రోడ్డు నుంచి కుర్మల్‌గూడ, నాదర్‌గుల్ మీదుగా నాగార్జున సాగర్ రహదారి వరకు ఇటీవల ఆర్ అండ్‌బీ అధికారులు రోడ్డును అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో గతంలో ట్రై జంక్షన్ వద్ద ఉన్న గ్రామాల పేర్లతో ఉన్న సూచిక బోర్డులను తొలగించారు. రోడ్డు పనులు పూర్తయ్యాక అధికారులు తిరిగి బోర్డులు ఏర్పాటు చేయలేదు. మూడు గ్రామాల పేర్లతో సూచిక బోర్డులను జంక్షన్‌కు మూడు వైపులా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎటు వెళ్లాలో తెలియకపోవడంతో కొందరు వాహనదారులు చాలా దూరం వెళ్లి తిరిగి వెనక్కి రావాల్సి వస్తోంది. దాంతో సమయం, ఇంధనం వృథా అవుతోందని వాపోతున్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులైనా మూడు కూడళ్ల జంక్షన్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తూ సంఘీభావ ర్యాలీ

ఎల్బీనగర్, మే 8(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాటు ఎటువంటి చర్యలు చేపట్టినా అండగా ఉంటామంటూ కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని చిత్ర లేఅవుట్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంఘీభావ ర్యాలీ చేపట్టారు. చిత్రాలేఅవుట్ ప్రధాన రహదారుల గుండా రంగారెడ్డి జిల్లా కోర్టుల వరకు ఊరేగింపు నిర్వహించి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ ర్యాలీలో బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్జీ, ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీమనోహర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా ఉపేందర్‌రెడ్డి, చిత్రా లేఅవుట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేష్, గణేష్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రామకృష్ణయ్య, సాయి, బావండ్ల రఘు, సత్యనారాయణరెడ్డి, కుసుమ, సబిత, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



హస్తినాపురం చౌరస్తాలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు పలుకుతున్న బీజేపీ అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మల్లేష్‌గౌడ్



ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ చేపట్టిన సంఘీభావ ర్యాలీలో బీజేపీ నేతలు శేఖర్జీ, ఉపేందర్‌రెడ్డి, మురళీమనోహర్

హస్తినాపురం చౌరస్తాలో..

చంపాపేట: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిం దూర్‌కు మద్దతుగా హస్తినాపురం చౌరస్తాలో బుధవారం రాత్రి బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజలు, ఆ పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరై ప్రజలు, బీజేపీ నేతలతో కలిసి జాతీయ జెండాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు రవికుమార్, రాజేంద్రప్రసాద్, మాధవరెడ్డి, గజ్జల రాజుగౌడ్, బూరం ప్రకాష్, గౌని వెంకటేష్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, రాజేందర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, విజయశ్రీ, అరుణసింగ్, శిరీషారెడ్డి, జీవన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీ, బంగ్లాదేశీయులను తరిమికొట్టండి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

ఎల్బీనగర్, మే 8(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీ, బంగ్లాదేశీ రోహింగ్యాలను తక్షణమే తరిమికొట్టేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అక్రమ విదేశీ చొరబాటుదారులను తక్షణమే గుర్తించి వారి వారి దేశాలకు తిప్పి పంపాలని కోరారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో అక్రమ చొరబాటుదారులు పాతుకుపోయారని వారందరిని తక్షణమే గుర్తించి తరిమివేయాలని ఆయన కోరారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణంలో వారి నుంచి అంతర్గత భద్రతకు ముప్పు రాకుండా ఉండేందుకు వారిని తక్షణమే వారివారి దేశాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, చింతల సురేందర్‌యాదవ్, బండారి భాస్కర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

సరూర్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ బాలాపూర్ మండల కమిటీ అధ్యక్షుడు దాసరి బాబు పిలుపునిచ్చారు. గురువారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, బీసీడబ్ల్యు ప్రతినిధులతో కలిసి సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కార్మికులందరూ ఈ సమ్మెలో పాల్గొని కార్మిక లోకం ఐక్యత కేంద్రానికి తెలిసేలా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ శేఖర్‌యాదవ్, గౌరవాధ్యక్షుడు యాదగిరిచారి, ఐఎన్‌టీయూసీ నాయకుడు శివ, ఏఐటీయూసీ నాయకులు నరేందర్, మున్నూరు కృష్ణ, వెంకయ్య, దాసరి నర్సింహ పాల్గొన్నారు.



సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రమోహన్




సార్వత్రిక సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దాసరి బాబు తదితరులు

మన్సూరాబాద్ : కార్పొరేట్ వ్యవస్థకు అనుకూలంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, లేబర్ కోడ్ల రద్దునకు ఈనెల 20న దేశ వ్యాప్తంగా జరుగనున్న సమ్మెలో ప్రతి కార్మికుడు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ పిలుపునిచ్చారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో గురువారం మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, నాయకులు సీహెచ్ కృష్ణయ్య, ఎం.నరహరి, వెంకటమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి

చంపాపేట, మే 8(ఆంధ్రజ్యోతి): ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ రమణారెడ్డి హబ్సిగూడలోని ఆయన నివాసంలో రాజిరెడ్డి పార్థీవదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. రాజిరెడ్డి మృతి తీరని లోటని రమణారెడ్డి అన్నారు.



మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి పార్థీవదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి

నెల రోజులుగా మురుగునీటి కంపు

పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు

హయత్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఎంఎం కుంట గ్రామంలో దేవాలయం పక్కనే నెలరోజులుగా మురుగునీరు రోడ్డువెంట పారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఎంఎం కుంట గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన కందాడి మహిపాల్‌రెడ్డి, కుంట రవికాంత్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, కామిశెట్టి యాదగిరి, హరీష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డిలు కలిసి గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం ముందు వరకు డ్రైనేజీ లైను వేసి వదిలి వేయడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని అన్నారు. ఔట్‌లెట్ నిర్మించకుండా మున్సిపాలిటీ అధికారులు సగం పనులు చేసి గ్రామం మీద వదిలి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పరసరాలన్నీ దుర్గంధభరితంగా మారాయని తెలిపారు. అటుగా వెళ్లలేకపోతున్నామని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల దేవాలయాని కి కూడా వెళ్లలేకపోతున్నామని తెలిపారు. గతంలో మున్సిపాలిటీ డీఈఈకి సమస్యను ఫిర్యాదు చేసినా కనీసం ఆయన స్పందించలేదని అన్నారు. మురుగునీటి వల్ల విపరీతంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని అన్నారు. మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకుంటే గ్రామస్థుల తో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. త్వరలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి సమస్యను వివరిస్తామన్నారు.



ఎంఎం కుంట గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు వెంట నెల రోజులుగా పారుతున్న మురుగునీరు



బాధితులకు రూ.10వేల నగదు అందజేస్తున్న తహసీల్దార్ వాణీరెడ్డి

బాధిత కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సాయం

మన్సూరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ సాయినగర్‌కాలనీలో గుడిసెలు దగ్ధమైన ఘటనలో ఒక్కో బాధిత కుటుంబానికి గురువారం అధికారులు తక్షణ సాయం కింద రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. విద్యుదాఘాతంతో మంగళవారం సాయినగర్‌కాలనీలోని గుడిసెల్లో అగ్నిప్రమాదం సంభవించిన విషయం విధితమే. కాగా ఆర్డీఓ, తహసీల్దార్‌లతో కలిసి బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ 30 బాధిత కుటుంబాలను గుర్తించి నష్టం జరిగిన తీరును తెలుసుకుని తక్షణ సాయం కింద వారికి రూ.10వేల అందించాలని సూచించగా గురువారం తహసీల్దార్ వాణీరెడ్డి, ఆర్ఐ అశ్వినిలు స్థానిక కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి ఒక్కో కుటుంబానికి రూ.10వేల నగదు సాయాన్ని అందించారు. కార్యక్రమంలో చింతల సురేందర్‌యాదవ్, మంజులారెడ్డి, నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యనాయక్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, బాధిత కుటుంబాలు పాల్గొన్నాయి.



పూర్ణాహుతిలో పాల్గొన్న తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ తదితరులు

భక్తి శ్రద్ధలతో పూర్ణాహుతి

చంపాపేట, మే 8(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడలోని సువర్ణ భారతి గోశాలలో జగద్గురు ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలు 10రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ వారి నేతృత్వంలో పూర్ణాహుతి కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. ఆది శంకరాచార్య భక్త సమాజం అధ్యక్షులు టి.రమేష్‌గుప్తా దంపతులు, కార్యదర్శి గుండా మల్లయ్యగుప్తా, ప్రధాన కార్యదర్శి కె.సతీష్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ సంస్థాగత ఎన్నికల కోరిటర్నింగ్ అధికారి, మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, ప్రవచన కర్త డాక్టర్ అనంతలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.



వాసవీ కన్యకాపరమేశ్వరి పల్లకీసేవలో పాల్గొన్న శ్రీనివాసగుప్తా

వాసవీ కన్యకాపరమేశ్వరి పల్లకీసేవ

కొత్తపేట, మే 8(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా గురువారం రాత్రి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాసగుప్తా అమ్మవారి పల్లకీసేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైశ్య ప్రముఖులు మొగుల్లపల్లి ఉపేందర్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు చింతల బాలరాజుగుప్తా, ఎల్‌వీ కుమార్, నవీన్, మంజుల పాల్గొన్నారు.




ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి

ఆకట్టుకున్న శ్రీసాయి స్పోర్ట్స్ డే వేడుకలు

చాదర్‌ఘాట్, మే 8(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో గురువారం స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, చెస్, క్యారమ్స్, రంగోళీ, మెహందీ తదితర పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడల ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతి సంవత్సరం కళాశాలలో స్పోర్ట్స్ డే వేడుకలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభను చాటుకున్న విజేతలకు ఆయన జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి, అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శోభారాణి, మమత, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

హయత్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన తలారి రాజు చిన్న కూతురు తలారి భాగ్య(21) సోమవారం ఉదయం 10.30గంటలకు టిఫిన్ తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తండ్రి రాజు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడం తో గురువారం తలారి రాజు తన కూతురు కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తలారి భాగ్య